

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 9 మే, 2013 సంచిక : 12

(విజయ నామ సం॥, వైశాఖ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం .......... | రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2

సముద్రాల కావల .......... 3

బాలవాణి - ఆ కథ కడుపులో .......... 4

షిరిడీ (కపర్దే) డైరీ .......... 5

శ్రీ సాయి సేవ .......... 7

స్వరాంజలి .......... 10

మీరా హృదయవాణి .......... 12

సర్వతోభద్ర ఆహ్వానం .......... 14

నామస్మరణ .......... 16

ఓ సారి చదవండి .......... 18

వివేకవాణి .......... 19

Surrender .......... 22

మాతృసంస్థ కబుర్లు .......... 23

స్వార్థ ఎందుకు పెరిగింది .......... 29

సత్సంగం-సత్ఫలితం .......... 32







# మా వాణి



వైశాఖి వచ్చింది. రెండు నెలల క్రిందటి నుంచే నిప్పులు చెరిగిపోస్తున్నాడు సూర్యభగవానుడు. ఈ ఎండలలో పిల్లలను కాపాడుకోవటం పెద్ద కష్టం. అందునా తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగులైతే మరీ కష్టం. పూర్వం అమ్మమ్మల యింటికో, సొంతపల్లెకో వెళ్లి హాయిగా చేలవెంటా తోటల వెంటా పరుగులు తీస్తూ, తోటల్లో మామిడికాయలు కొట్టుకొచ్చి ఉప్పకారాలద్దుకొని మేస్తూ, ఈతపళ్లు, తాటిముంజెలు తింటూ, కామంచి పళ్లు ఏరుకొంటూ, సాయంత్రానికి తాతయ్య మంచం ఎక్కి పాతపాత కథలు వింటూ .... ఓహ్! ఆ బంగారులోకానికి మనమే తెరలు దింపేసుకొన్నాం. 'మైక్రో ఫేమిలీలు' తయారుచేసుకొని మరి మన పిల్లలకు మన నాగరికత, మన సంస్కృతి తెలిసేదెలాగ!

అయ్యో, తల్లిదండ్రులూ, చెరో వారం సెలవుపెట్టే ప్రయత్నం చేయండి. మీమీ పిల్లలతో ఫ్రీగా-హాయిగా-మీరూ ఆ వయస్సుకు దిగిపోయి ఆటలాడండి. మీ బాల్యం గురించీ, అప్పటి ఆటలను గురించీ, మీ అన్నదమ్ముల అల్లర్ల గురించీ, మీరు చూచిన ప్రదేశాల గురించీ చెప్పండి. చిన్న చిన్న కథల ద్వారా హనుమంతుడు, అభిమన్యుడు, భీముడు వంటి వీరుల గురించీ, మన ప్రాచీన ప్రభువుల ఘనత గురించీ చెప్పండి. రామాయణ, మహాభారతాలు, వివేకానంద చరిత్ర, శ్రీ సాయి చరిత్ర వంటి వాటిలో పిల్లలకు అందే విషయాలు వివరించండి. హిందువుల జీవన విధానం గురించి వివరించండి - బొట్టు ఎందుకు, ముగ్గులెందుకు, దీపం ఎందుకు, తులసి దేనికి పెంచాలి -ఇలాటివన్నీ వివరించి చెప్పండి. మన నేల గొప్పదనం ఏమిటో చెప్పండి. పరిసరాలలో ఉన్న గుడికి వెళ్లి అక్కడి పూజారి ద్వారా నాలుగైదు సంస్కృత శ్లోకాలు నేర్పించండి. మీకే వచ్చి మీరే నేర్పకోగలిగితే మరీ మంచిది. దీనివలన నోరు తిరుగుతుంది.

కంఠస్వరం శుద్ధమవుతుంది కూడా. నీతిచంద్రిక కథలు, శతకపద్యాలు కనీసం పదేసి నేర్పండి. ఆడపిల్లలకు ముగ్గులు (నేల మీద-కాగితం మీద కాదు) వేయటం నేర్పండి. మీతో కలిసి చిన్న చిన్న పనులు, వంటలు అందరికీ చేయడానికి ప్రోత్సహించండి. వారానికొకసారి బాలసత్సంగం లాగా ఏర్పాటు చేసి, చిన్న చిన్న కథలు చెప్పటం, ఓ నాటిక వెయ్యటం (ఏ భాషలోనైనా సరే) చిన్న భజనలు, ఆటల పోటీలు, దేశభక్తుల కథలు, స్వాతంత్ర్య పోరాటగాథలు వినిపించండి, చెప్పించండి. మీతో గడపటం మీ పిల్లలకు ఎంతో యిష్టం ఉంటుంది-గమనించండి.

ఈ మాత్రం మీ పిల్లల కోసం శ్రద్ధ తీసుకోగలగాలి మీరు. పెయింటింగ్ క్లాసులు, స్విమ్మింగ్ క్లాసులు, మరోటీ మరొకటీ వాళ్ల శారీరక, మానసిక శక్తులను పెంచుతాయే తప్ప - హృదయాన్ని వికసింపజేయవు-వాళ్లలో సంస్కారదీపాన్ని వెలిగించలేవు. అంచేత యివన్నీ నేర్పండి. అమ్మలారా, అయ్యలారా, యివన్నీ ఇంటర్నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకోమని మాత్రం వాళ్లకు చెప్పకండి ప్లీజ్! మీరు నేర్చుకోండి - వాళ్లకు నేర్పండి - అనుబంధం పెరుగుతుంది మీ మధ్య - నిజ్జం - భారతమాత మీద ఒట్టు!

## సముద్రాల కావల ...

ఉగాండా దేశంలోని కంపాలాలో నివసిస్తున్న భారతీయులు-హిందువులు శివరాత్రినాడు "ఓం నమశ్శివాయ" మంత్ర జపం చేశారు. ఉపవాసాలు చేసారు. రాత్రి పన్నెండు గంటల వరకు నామసంకీర్తనం చేసాక-శివ లింగోద్భవ వేళ శ్రీ సాయీశ్వరునికి క్షీరాభిషేకం చేసుకున్నారు. హారతులిచ్చి తరించారు.

వారి సత్సంగశాఖలో సాయిధామం వారి శ్రీ సాయి-సేవ" అనే గ్రంథాన్ని పారాయణ చేస్తున్నామనీ, అది అందరిలో ఒక చైతన్యాన్నీ, సేవా స్ఫూర్తినీ కలిగిస్తున్నదనీ, రచనా సంవిధానం-భాష కూడా దూర తీరాలలో ఉన్న తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నదనీ తెలియజేస్తున్నారు శ్రీ మోహనరావుగారు. ఆ సత్సంగ శాఖీయులందరూ చక్కని సేవామార్గంలోకి, తద్వారా సాయిచరణ సన్నిధానానికీ రాగలరని పరమ పూజ్య గురుదేవుల ప్రేమాశీస్సులు.





బాలవాణి

# ఆ కథ కడుపులో...

- మాతాజీ శుకవాణి

"ఒకతనికి ఒక అందమైన గుర్రం ఉంది. అది తనకుచేతనైనదేదో చేస్తుందే గానీ యజమాని చెప్పే స్వారీకి పనికిరాదు. చుట్టుప్రక్కలంతా తిప్పి ఎంత శిక్షణ యిచ్చినా లాభం లేకపోయింది. అప్పుడొక పండితుడు యజమానికి అది ఎక్కడినుంచీ వచ్చిందో అక్కడికే తీసుకువెళ్ళమని చెప్పాడు. యజమాని అలాగే చేసాడు. గుర్రం జీను వేస్తే సరిగా నిలబడింది. సరైన త్రోవకు వచ్చింది" - ఈ కథ శ్రీ సాయినాథుల వారు ఒకనాడు మసీదులో చెప్పినది.

ఇందులో యజమాని సాధకుడు.అందమైన గుర్రం అహంభావంతో కూడిన కోరికలతో మదించిన మనస్సుకు ప్రతీక. ఇది సాధకునికి ఓ పట్టాన లొంగదు. దానికి చేతనైనదేదో చేయటం-అంటే తనకు తోచిన తీరులో పరుగులు తీస్తుందే తప్ప సాధకుడు నడపదలచిన పద్ధతిలో నడవదు. అలాంటిదాన్ని లొంగదీసి స్వారీ చెయ్యటం ఎలా? లౌకిక విషయాలన్నీ మనసును ఎటెటో లాక్కుపోతుంటాయి. దాన్ని లొంగదీయటం-అంటే భగవన్మార్గంలోకి తేవటం అన్నది అంత తేలిక కాదు. మరెలాగ? యజమాని (సాధకుడు) ఒక పండితుని-అంటే ఇలాంటివన్నీ తెలిసిన ఒక గురువు సలహా తీసుకున్నాడు. అతడు ఆ గుర్రాన్ని ఎక్కడినుంచీ తెచ్చాడో అక్కడికి తీసుకువెళ్ళమన్నాడు. అంటే "నేనెవరు" అన్న తీవ్ర విచారణ చేయించాలి మనసు చేత. వచ్చే ఆలోచనలకు మూలం ఎక్కడ? మాటి మాటికీ ఆ ఆలోచనలను ఒక్కటొక్కటిగా వెనుకకు తీసుకువెళ్లటం, మూలం ఎక్కడ ప్రారంభమైందో కనుక్కోవటం. అలా మాటిమాటికీ వచ్చిన ఆలోచనలన్నిటినీ అదే క్రమంలో వెనక్కు లాక్కువెళ్లి ఆరంభం ఎక్కడో కనుక్కోవడాన్ని "థాట్ రిట్రేసింగ్ ప్రాసెస్" అంటారు. ఇది ఆలోచనలవేగాన్నీ, చాంచల్యాన్నీ అరికట్టడానికి ఎంతగానో ఉపకరిస్తుంది.క్రమక్రమంగా దాని దూకుడు తగ్గిపోతుంది. 'మనసు' అంటే ఆలోచనల సముదాయమే గదా! దాని ఏపు అణగగానే జీను వేసాడు దాని మీద. స్వస్వరూపజ్ఞానం రాగానే మనసు శమిస్తుంది. దానితో సాధన వేగం పుంజుకొంటుంది. ఇక సాధకుడు సఫలీకృత మనోరథుడే. మనస్సు బంధానికీ, మనసే మోక్షానికీ మూలం గదా! ఇంత చిన్న కథ పొట్టలో ఇంత భావాన్ని ప్రతీకాత్మకంగా చెప్పారు శ్రీ సాయిబాబా.



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

**- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే**

**అనువాదం : మాతా శుకవాణి**

(గత సంచిక తరువాయి)

## షిరిడీకి నా రెండవ యాత్ర–సుదీర్ఘకాలం నివాసం

06-12-1911

నా టాంగా దీక్షిత్ కొత్తగా నిర్మించిన ఇంటి దగ్గరకు వెళ్తుండగానే నాకు మొదట కనిపించిన వ్యక్తి మాధవరావ్ దేశ్‌పాండే. నేను టాంగా దిగకముందే దీక్షిత్ నన్ను ఆవేళ తనతో భోంచేయమని ఆహ్వానించాడు. నేను, మాధవరావ్ కలిసి సాయి మహరాజుకు నమస్కారం చేయడానికి వెళ్ళాం. మేము వెళ్ళేసరికి వారు చేతులు, కాళ్ళు కడుక్కుంటున్నారు. అందుచేత దూరం నుంచే నమస్కరించి వచ్చేశాము. ఆ తర్వాత నేను కూడా స్నానం, ప్రార్థన వగైరాలతో హడావుడిగా ఉండటంతో వారు బయటకు వెళ్ళినప్పుడు నేను నమస్కరించుకోలేక పోయాను. ఆ తరువాత మసీదుకు వెళ్ళి వారికి దగ్గరగా కూర్చున్నా. ఆయన ఒక కథ చెప్పారు. అది ఓ ఫకీరుతో తాను కొంతకాలం గడిపిన కథ. ఆయన కాస్త భోజనప్రియుడు. ఈ ఫకీరుని ఒక విందుకి పిలిచారు. సాయి మహరాజ్‌ను వెంటబెట్టుకొని వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు ఫకీరు భార్య సాయి మహరాజుకు ఓ పాత్ర ఇచ్చి విందు భోజనాన్ని కాస్త అందులో పెట్టించుకు రమ్మన్నది. ఫకీరు శుభ్రంగా భోజనం చేసి ఆ ప్రదేశంలోనే నిద్రపోవడానికి నిర్ణయించు కున్నాడు. సాయి మహరాజు పిండివంటల మూట వీపుకు కట్టుకొని, ద్రవాహారపు పాత్ర తలమీద పెట్టుకొని ఒక్కరే తిరిగి వెళ్ళారు. దారిలో త్రోవ తప్పారు. తిరిగి తిరిగి ఒక మాంగ్‌వాడ దగ్గరలో విశ్రాంతి తీసుకుందామని





కూర్చున్నారు. కానీ కుక్కలు మొరగడంతో మళ్ళీ లేచి నడుచుకుంటూ ఎలాగో ఊరు చేరుకున్నారు. తాము తెచ్చిన పదార్థాలు ఫకీరు భార్యకు ఇచ్చారు. ఆ సమయానికి ఫకీరు కూడా ఇంటికి చేరుకున్నాడు. ఇద్దరూ కలిసి కడుపు నిండా తిన్నారు. ఈ విషయం చెప్తూ బాబా “ఒక మంచి ఫకీరు కనబడటమే అరుదుగా ఉంది” అని అన్నారు.

గత సంవత్సరం నేను షిరిడీ వచ్చినప్పుడు సాఠేవాడాలో ఉన్నాను. ఆ వాడా నిర్మించిన సాఠే మసీదులోనూ, భోజనాల దగ్గర కూడా కలిశాడు. దీక్షిత్ చాలామందికి భోజనాలు పెట్టాడు ఆరోజు. వారిలో స్వర్గీయ శ్రీ మాధవరావ్ గోవిందరెనడేగారి చెల్లెలి కొడుకు శ్రీ తోసార్ కూడా ఉన్నారు. తోసార్ బొంబాయి లోని కస్టమ్స్ ఆఫీసులో ఉద్యోగి. ఇతను చాలా మంచి మనిషి. మేమంతా కూర్చొని మాట్లాడుకున్నాం. నాసిక్ నుండి వచ్చిన ఒక పెద్దమనిషి, అనారోగ్యంతోఉన్న తన భార్యతో కలిసి వచ్చిన టిప్‌నిస్, బాపూ సాహెబ్ జోగ్, వారి భార్య (ఈవిడ ఆరోగ్యం గానే ఉంది) కూడా ఆనాటి దీక్షిత్ అతిథులలో ఉన్నారు. మిస్టర్ నూల్‌కర్ అప్పటికే మరణించారు. ఆయనను నేను చాలా మిస్సయ్యాను. అతని కుటుంబీకులు కూడా ఎవరూ లేరు. బాలాసాహెబ్ భాటే ఇక్కడే ఉన్నాడు. ఆయన భార్య దత్త జయంతినాడే బిడ్డను కన్నది. మేము దీక్షిత్ వాడాలోనే ఉన్నాము - అసౌకర్యంగా ఉన్నది.

**(సశేషం)**

**పిల్లలకు వేసవితాపం అణగడానికి చిట్టుడుకు నీళ్లు (బియ్యంలో ఎసరు పోసి పెట్టి, తొలి పొంగు వచ్చేప్పటి నీళ్లు-(గంజి ఎక్కకూడదు) తీసి ఆ నీళ్లు బాగా ఆరబెట్టి, సాయంత్రం ఉప్పు, నిమ్మరసం కలిపి ఇవ్వండి. పెద్ద ఉల్లి పచ్చిముక్కలు పెరుగన్నంతో పెట్టండి. సబ్జా గింజలు నానబెట్టిన నీళ్లు, చక్కెర కలిపివ్వండి. పల్చని మజ్జిగలో ఉప్పు, చక్కెర వేసి యివ్వండి. బెల్లం నీళ్లలో కొద్దిగా మిరియాల పొడి కలిపి పానకం చేసి యివ్వండి. దరిద్రపు కూల్‌డ్రింక్స్ యివ్వకండి. మరిన్ని రోగాలబారిన పడవేయకండి.**

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

(గత సంచిక తరువాయి)

## సేవకునికి కావలసినవి

సేవారంగం విషయంలో స్వామీ వివేకానంద కొన్ని నిర్దుష్టమైన సందేశాలను ఇచ్చారు. "మేము ఎవరికైనా సహాయం చేసాము' అన్నమాట వినబడితే చాలు - ఆయన మండిపడేవారు. "నువ్వు ఒక క్షుద్రజీవివి. నీకు మరొక జీవికి సహాయం చేసేంత శక్తి ఉన్నదా? 'సేవ' అను" అని కమ్చీతో బాదినట్లే కోప్పడేవారు. సేవ ద్వారానే మనిషి ముక్తిని సాధించగలడు అనే కర్మయోగ నిర్దేశకమైన ఉపనిషన్మంత్ర భాగం - "ఆత్మనోమోక్షార్థం, జగద్ధితాయచ" అన్నదాన్ని ఆయన పదేపదే చెప్పేవారు.

స్వామీజీ సేవకుడికి ఉండవలసిన మూడు లక్షణాలను గూర్చి విపులంగా అందించారు. వాటిలో మొదటిది - నీలో సేవ చెయ్యకుండా ఆగలేనంత తపన ఉండాలి. అలా ఏమీ చేయలేని నాడు నీకు నిద్రాహారాలు సహించకూడదు. 'అయ్యో, చెయ్యలేకపోయానే' అన్న తాపం నీలో రగలాలి.

అబ్రహాం లింకన్ ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికా. ఆయనొకరోజు రోడ్డు వెంట వెడుతున్నారు. ప్రక్కన బురదగుంటలో నుంచీ గుర్‌గుర్‌మన్న చప్పడు వినిపించింది. చూస్తే ఓ పందిపిల్ల. పైకి రావాలని ప్రయత్నిస్తున్నది. కొంచెం ఎక్కుతోంది. మళ్లీ జారిపోతోంది. గుర్‌గుర్‌మని ఏడుస్తోంది. లింకన్ చొక్కా చేతులు పైకి మడిచి, వంగి ఆ పందిపిల్లను గోతిలోంచి తీసాడు. ఒడ్డున పెట్టేసి తన త్రోవన తాను వెళ్లిపోయాడు.





ఎవరో యిది చూచారు. అలాఅలా వార్తాపత్రికలకు ఎక్కేసింది. "అబ్రహాం లింకన్ కరుణామయుడు" అంటూ కీర్తించాయి పత్రికలు. అవి చదివి లింకన్ నవ్వేసాడు. "నాకు ఆ పందిపిల్ల మీద కాదు - నామీదే ప్రేమ ఎక్కువ. ఒకవేళ దాన్ని పైకి తియ్యకుండా వెళ్లిపోయాననుకోండి. ఇక రాత్రికి నాకు నిద్ర ఉండదు. పాపం ఏమయిందో దాని తల్లికి దూరమై ఎంత ఏడుస్తోందో - తియ్యక పోతినే" అన్న ఆలోచన నాకు నిద్ర పట్టనీయదు. అందుకని నేను హాయిగా నిద్రపోవాలంటే పందిపిల్లను రక్షించి తీరాలి. అదీ సంగతి" అన్నారు.

మనలో అలా నిలవనివ్వని తపనను కలిగించేందుకు మనలో బేసికల్‌గా (మౌలికంగా) ప్రేమ ఉండాలి. నాలుగేళ్ల ఆశ్రమ బాలిక చైత్ర ఆశ్రమవాసులు అరవైమందిలో ఏ ఒక్కళ్లు భోజనానికి రాకపోయినా "ఎందుకు అన్నం తినలేదు? అట్టెందా? జొరమొచ్చిందా?" ఇలా వెంటపడి పడి అడుగుతుంది. "నీకెందుకే, ఊరుకో" అన్నా సరే ఊరుకోదు. "పోనీ పాలన్నా యివ్వు వాళ్లకు" అంటుంది. అదిగో అలా నిలవనివ్వని తపన నీలో ఉందా? ఉంటేనే నీవు సేవకుడివవుతావు.

వివేకానందులు చెప్పిన రెండవ అంశం - ఎలాంటి సేవ చెయ్యాలి ... ఎలాంటి వారికి చెయ్యాలి .... రోజుకెన్ని గంటలు అందుకు ఉపయోగించ గలవు ... ఇంతకాలం చెయ్యాలన్న లెక్క ఉందా, ఎప్పటికీనా? - ఈ మాదిరి విషయాలన్నింటిని గురించిన స్పష్టత నీలో ఉండాలి. ఏదో ఏ తిరుపతి లోనో ప్రసాదాలు పంచటమో, హైదరాబాద్ గణపతి ఉత్సవాల్లో జనాలను లైన్లో నిలబెట్టడంలాంటివో ఐతే ఫర్వాలేదు ... అప్పటికప్పుడు అయిపోతుంది. ఇక చేతులు కడుక్కోవచ్చు. కానీ, శాశ్వత ప్రాతిపదిక మీద రంగంలోకి దిగాలనుకొన్నప్పడు మాత్రం యీ స్పష్టత చాలా అవసరం.

ఇక మూడవ అంశం - తీరా దిగిన తరువాత మడమ తిప్పని, వెను తిరిగి చూడని స్థిరత్వం (కలేజా అందామా) నీకున్నదా? ఇది ఎవరికి

వాళ్ళమే తీవ్రంగా నిర్ద్వంద్వంగా ఆలోచించుకోవలసిన విషయం. ఈ రంగంలో అనేక రకాల అవాంతరాలు వస్తాయి. టైమ్ యివ్వటం విషయంలో, డబ్బు ఖర్చు పెట్టడం విషయంలో, వేళాపాళా లేకుండా తిరగవలసి రావటంలో - ఎన్నో రకాల వివాదాలు గృహసభ్యులతోనే రావచ్చు.

ముప్లై ఏళ్ళో, నలభై ఏళ్లో ఉద్యోగాలు చేసి, పిల్లలంతా సెటిలై, వీళ్లు రిటైరయ్యాక కూడా - స్వేచ్ఛగా సేవారంగంలోకి రాలేని వారెందరో మనకు కన్పిస్తారు. కారణం-జీవన భాగస్వాముల అభ్యంతరాలు. ఏదో సత్సంగాలు, తీర్థ సేవనాలు, యాత్రా పర్యటనలు అయితే అభ్యంతరాలుండవు. కానీ పూర్తిగా సేవే పనిగా తీసుకొని మిగిలిన లౌకిక బంధాలకు విలువ తగ్గిస్తూంటే అనేక రకాల పేచీలు రావచ్చు. మొదట్లో వాళ్లు కూడా ఉత్సాహపడినా తరువాత్తరువాత వెనక్కు లాగవచ్చు.

మునుపటి మిత్రులు, పార్టీలు, వినోదాలు, క్లబ్బులు వగైరాలు దూరమై ఆ మేరకు మీకు వెలితిగా అనిపించవచ్చు. మీ రంగంలో మీతోపాటు పని చేసేవారికీ మీకూ సరైన సయోధ్య ఏర్పడకపోవచ్చు. మీకు దొరికిన పని మీకు సంతృప్తికరంగా లేకపోవచ్చు. మీసాటి వారికి వచ్చినంత కీర్తి ప్రతిష్ఠలు మీకు దొరక్కపోవచ్చు. కనీసం సాటివారిలో గుర్తింపు కూడా లభించకపోవచ్చు. ఇవన్నీ కలిసి మీలో తెలియని అసంతృప్తి పెంచవచ్చు.

మీ గత సంస్కారాలు మిమ్మల్ని వెనక్కు - గతకాలంవైపే లాగుతుండవచ్చు. మీ వలన సేవ పొందినవారే మీలో లోపాలెంచటమో మీపై నిందలు వేయటమో చేయవచ్చు. ఎన్ని భయంకర - కాకపోయినా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా సరే - అడుగు వెనక్కు వెయ్యకుండా ముందుకు సాగగలవా? సముద్ర మధ్యంలో శిలలాగా అచంచలంగా నిలవగలవా? అప్పడే నీవు సేవకుడివవుతావు - అన్నారు వివేకానందులు. ఇవి ఆయన అనుభవ మథనంలో నుంచి వచ్చిన ఆణిముత్యాల వంటి అంశాలు.

**(సశేషం)**





## స్వరాంజలి

# మళ్ళీ రావయ్యా

## 'మళ్ళీ రావాలి' విద్యార్థుల కవితల పోటీలో బహుమతి పొందిన కవితలు

**- పి. సాయిపూజ, 10వ తరగతి**

మునిగిపోతున్న ప్రపంచాన్ని ఒడ్డుకు చేర్చడానికి,
అంధకారమనే అజ్ఞానం నుండి విముక్తులను చేయడానికి,
ప్రపంచవినాశనాన్ని కోరుతున్న మృగాలను వేటాడటానికి,
లంచగొండితనం, దోపిడీలను అణగద్రొక్కడానికి
అవినీతి జలపాతంలో కొట్టుకుపోతున్న అమాయక ప్రజలను
రక్షించడానికి,
ఓయీ వివేకానందా! మళ్ళీ రావయ్యా!
ఆడపిల్లలపై జరిగే అత్యాచారాలను అరికట్టడానికి,
కలుషపూరితమైన ప్రజల హృదయాల చీకటి చీల్చడానికి,
తరుణం ఎప్పుడొస్తుందా రణం చేద్దామని
పొంచి ఉన్న పరశక్తులను తరిమికొట్టడానికి,
స్వాభిమానం కోల్పోయిన నీ బిడ్డలలో రోషం రగిలించడానికి -
ఓయీ వివేకానందా! మళ్ళీ రావయ్యా!
నీ జాతిని మంచి మార్గంలో నడుపవయ్యా,
చేతులెత్తి శరణు వేడుకుంటున్నామయ్యా,
మరొక్కసారి భారతావనికి దిగి రావయ్యా!



# మళ్ళీ రావమ్మా


- బి. సత్య స్వప్న, 10వ తరగతి

మళ్ళీ రావమ్మా, ఝాన్సీ రాణమ్మా,
మహిళాలోకానికి ఆదర్శం నీవమ్మా!
ధైర్యానికి నీవు పెట్టింది పేరమ్మా,
నిస్తేజంగా నీరసించిన
మహిళాలోకాన్ని నిద్రలేపమ్మా!
స్త్రీ అంటే తనువే కాదని నేర్పమ్మా,
వారిపై అత్యాచారాలను రూపుమాపమ్మా,
మళ్ళీ రావమ్మా ఝాన్సీ రాణమ్మా!
మగువ మాంచాల నీకు తోడమ్మా!
ఆంగ్లేయుల పట్ల యమదూతవు నీవమ్మా,
అయినాగానీ వారికి అన్నం పెట్టిన అమ్మతనం నీదమ్మా!
భారతీయుల ఆత్మస్థైర్యం నీవమ్మా,
అందులో రవంత మాకూ యివ్వమ్మా,
నేటి యీ నీచ దశ నుండీ మము కాపాడమ్మా,
మళ్ళీ రావమ్మా ...! ఝాన్సీ రాణమ్మా ......!










# మీరా హృదయవాణి



మీరాబాయి ఆబాల్యం గిరిధర గోపాలుని మనసా, వాచా సేవించిన భక్తురాలు. చిన్ననాడు తల్లిని, "నా పెళ్లెప్పుడు చేస్తావు? నా వరుడేడీ?" అని అడిగింది పొరుగింటి పిల్ల పెళ్లి చూచి. తల్లి ఒక కృష్ణుడి బొమ్మ చేతిలో పెట్టి "వీడే నీ వరుడు" అన్నది. ఆ బాలిక హృదయంలో అది ముద్రపడి పోయింది. కృష్ణుడే తన సఖుడు, ప్రియుడు, పతి - సర్వస్వమున్నూ. వివాహం చేసారు తల్లిదండ్రులు. భర్త మీరా ఆర్తిని అర్థం చేసుకున్నాడు. కుల మర్యాదలకు అతీతంగా కృష్ణ సంకీర్తనతో సాధువుల వెంట తిరిగే మీరాకు ఆయన స్వేచ్ఛనిచ్చాడు. ఎట్టి దశలోనూ తన గిరిధరనాగరుడిని విడువకుండా, భజిస్తూ మహాభక్తురాలై తరించింది మీరాబాయి. ఆమె భజనలలో ఆర్ద్రత, ఆర్తి, ఆరాధన, సుకుమార భావన, ఎంతో లోతైన వేదాంతానికి అందమైన, లలితమైన మేలిముసుగూ కన్పిస్తాయి. ఈ భజన చూడండి -

'తనక్ హరి చితనౌజీ మేరీ ఓర్,
హమ్ చితవత్ తుమ్ చితవత్ నాహీం, దిల్‌కే బడే కఠోర్!
మేరే ఆసా చితవని తుమరీ, ఔర్ న దూజీ దోర్
తుమ్ సే హమ్‌కూ కబర్ మిలోగే, హమ్‌సీ లాఖ్ కరోర్
ఊభీఠాఢీ అరజ్ కరత్ హూం; అరజ్ కరత్ భయేభోర్
మీరాకే ప్రభు హరి అబినాసీ, దేస్యూ ప్రాణ్ అకోర్ ॥

- మీరా తన ప్రభువు దృష్టి తన మీద పడలేదనీ, తానెంతగా ఆయన మీదనే దృష్టి నిలిపి అదే పనిగా ప్రార్థించినా ఆయన తనవైపు ఒక్కసారైనా చూడలేదనీ ఆవేదన చెంది కృష్ణునితో నిష్ఠూరాలాడుతోంది యీ భజనలో. ఆ గిరిధరుడు మహా కఠోరహృదయుడైపోయాడు. (గిరితో సాంగత్యం వల్లనేమో!) రవంత చూపు ఇటు ప్రసరించవయ్యా! అంటే వినటం లేదు. "ప్రభూ! నాకు వేరే కోరికలేవీ లేవు. నిన్నేమీ అడగటం లేదుగా! ఒక్కటంటే ఒక్క చూపేగా అడిగేది! నీవు మహా కఠినాత్ముడివయ్యా! ఎంత వేడినా


ఒక్కసారైనా కరుణించవేం!" ఒంటికాలి మీద నిలబడి మరీ రేయంతా ప్రార్థన చేస్తోంది మీరా. ఆయన కృపా దృష్టిని మించి వేరేదీ కోరదు ఆ పరమభక్తురాలు. మరి, ఆయనెందుకు చూడడు? ఇలాటివారు ఎందరో ఆయనకు. ఈమెకు మాత్రం మరెవ్వరూ అక్కరలేదు. అలాంటి భక్తురాలిని ఎందుకు కరుణతో చూడడు గిరిధరుడు? దీనికి కారణం భాగవతంలో కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు మధురకు వెళ్లిపోయి కంస వధ చేసి అటుపైన రాజకీయాలలో మునిగిపోవలసి వచ్చింది. అతడు ఉద్ధవుడితో గోపికలకొక సందేశం పంపించాడు. తాను వారిని విడిచి వెళ్లినందుకు వాళ్లెంతో బాధపడుతుంటారనీ, నిష్ఠురాలాడతారనీ కృష్ణునికి తెలుసు. అంచేత ఆయన ఇలా కబురు చేసాడు - "మానసబంధుడ, నిత్యధ్యానము మీ కొసగవలసి తలగితిచుండీ!" దీనికి ఉపబలకంగా మరో పద్యం కూడా వచ్చింది పోతన్నగారి లేఖిని నుండి -

"పాయని గేహశృంఖలముఁబాసి, నిరంతరమత్పరత్వముం
జేయుచునున్న మీకుఁ బ్రతిసేయ యుగంబులనైన నేర నన్
బాయక గొల్చు మానసము ప్రత్యుపకారముగాఁ దలంచి నా
పాయుట తప్పగా గొనక భామినులార! కృపన్ శమింపరే!"

భగవంతుని మీది ప్రేమతో మిగిలిన లౌకిక కాంక్షలన్నీ విడచి జీవించే పరమభక్తుల ఋణం తాను కూడా తీర్చుకోలేనన్నాడు ఆయనే. వాళ్లకు తాను చేయగలిగే మేలొక్కటేనట-అది వారు నిరంతరం తనను సేవించగలిగే మహోన్నత హృదయం వారికి ప్రసాదించడమట. తాను స్వయంగా ఎదురుగా ఉన్నప్పటికంటే దృష్టికి దూరంగా ఉన్నప్పడే మనసుకు, స్మరణకు చేరువవుతారు గనుక వారిలో నిత్య ధ్యానం నింపటం కోసమే తాను దూరమయ్యానన్నాడు కృష్ణుడు.

వినాశనం లేని (శాశ్వతుడైన కాలాతీతుడైన) తన ప్రభువు కోసం తన నశ్వర ప్రాణాలను ఆయన పాదాల చెంత సమర్పించుకొంటాననంటున్నది మీరాబాయి. ఒక్క కృపా దృష్టి కోసం ఆ మహాభక్తురాలి ఆరాటంలో శత సహస్రాంశమైనా మనకుండరాదా!





# "సర్వతోభద్ర"
# సాయినాథ క్షేత్రం, మైనేనివారి పాలెం, గుంటూరు జిల్లా
# "విజయ" వార్షికోత్సవాలు

ప్రియ మిత్రులారా,

మైనేనివారి పాలెంలో శ్రీ సాయినాథుల వారు వేంచేసి సర్వతోభద్ర దేవాలయంలో కొలువై ఈ మే 12 నాటికి ఏడు సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ సందర్భంగా జరుగ నున్న కార్యక్రమాల వివరాలు దిగువ యిస్తున్నాము. కృష్ణానదీ తీరాన సుందర సీమలో నెలకొన్న చక్కని దేవాలయం సర్వతోభద్రలో కొలువైన యీ సాయినాథుల వారు "ప్రసన్నసాయి". భక్తులకు కొంగు బంగారం. ఆపదలలో ఉన్న వారికి అభయమూర్తి. వారి దర్శన మాత్రాననే ఎందరికో ఎన్నెన్నో మేళ్లు కలుగుతాయి. అలాటి స్వామి దర్శనానికై తరలిరండి. కార్యక్రమాలలో పాల్గొని తరించండి. శ్రీ సాయీ ప్రసన్నులైన గురుదేవులు, పరమ పూజ్యులు, సాయి దత్త పీఠాధి పతులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారి దివ్యాశీస్సులు అందుకొని ధన్యులు కండి. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం.

| | | | |
|---|---|---|---|
| **11-05-13** | ఉదయం | 6.30 | అభిషేకం |
| **శనివారం** | | 8.00 | శ్రీ సాయికి సహస్ర నామార్చన |
| | | 10.00 | శ్రీ సాయి చాలీసా పారాయణం |
| | | 11.00 | విష్ణు సహస్ర నామ పారాయణం |
| | | 4.00 | గీతా పారాయణం |
| | రాత్రి | 7.00 | భజన, సత్సంగం |
| | | | శ్రీ సచ్చరిత్ర పారాయణ |

12-05-13 ఉదయం 6.00 క్షీరాభిషేకం, ఫలరసాభిషేకం, జలాభిషేకం
ఆది వారం 8.30 సాయి సహస్ర నామార్చన (సామూహికంగా)
బిల్వ, తులసీ దళాలు, పుష్పాలతో
11.00 శ్రీ గురుదేవుల ప్రవచనం
11.30 భక్తులకు ఆశీర్వచనం
12.00 మహా హారతి
12.30 అన్నప్రసాద వితరణ

**అన్ని కార్యక్రమాలకూ ఇదే సాదర ఆహ్వానం**

ఈ ఉత్సవాలకు సహకారం అందించదలచినవారు దిగువ ఫోన్ నెంబర్లలో సంప్రదించగలరు.

**9848133565, 9989422230, 8978011913**

**- కార్యనిర్వాహకులు**

**సాయినాథ క్షేత్రం, మైనేనివారి పాలెం**

# నామస్మరణ

**- స్వర్గీయ శ్రీ భారం మణి ఉమామహేశ్వరరావు**

క్రీ.శ. 1910లో జస్టిస్ రేగే షిరిడీని దర్శించినపుడు బాబా అతనిని రాధాకృష్ణఆయి యింట్లో ఉండుమన్నారు. ఆ రోజు నుండి 1916లో రాధాకృష్ణ ఆయి కాలధర్మమునొందే వరకు ఆయన ఎప్పుడు షిరిడీ వచ్చినా ఆమె యింటి యందుండేవాడు. రాధాకృష్ణ ఆయియే తనకు నిజమైన తల్లిగా భావించువాడు. ఆమె కూడ అతనిని తన స్వంత బిడ్డవలె చూచుకొనేది. బాబా ఆమెకు రోజూ ప్రసాదంగా ఒక్క రొట్టెను పంపేవాడు. రేగే వచ్చినపుడు రెండు రొట్టెలు పంపేవాడు. ఆమె సాయి కొరకే బ్రతికినది. తన భక్తిని సర్వమూ బాబాకే అర్పించినది. బాబా చెప్పిన దానిని చేయటం, సాయి సంస్కారమునకు కావలసిన వానిని చేకూర్చటం అంటే ఆమెకు





తృప్తి, ఆనందము ఉండేది. అందుకై బాబా సేవ చేయుటకు ఆమెకు చేతినిండా పని ఉండేది. ఆమె రేగే, పురందరే లాంటి వారిని బాబా సేవ-అందునా దాస్య సేవ చేయుటకు తగిన పనులు కల్పించి పురమాయించేది. ఆధ్యాత్మికాభివృద్ధికి సేవ ఒక్కటే కాదు. అది దైవార్పితం చేయగల మనసు కూడా కావాలి. బాగా అభివృద్ధి నందిన సాధకుడు గాన రేగే రాధాకృష్ణ ఆయి కూడ సాధనలో పురోగతిలో ఉన్నదని గ్రహించినాడు. ఆమె భక్తికితోడు కొన్ని శక్తులను కూడ కలిగియుండెడిది. ఆమెకు సంగీతముపై గల పటుత్వము ఆమెలో ఏకాగ్రతకు దోహదమైనది. ఆమెకు మంచి శ్రావ్యమైన కంఠముండేది. సంగీతముపై అభినివేశము కూడ ఉండినది. వారిరువురు మాట్లాడుకొని, ఆధ్యాత్మికంగా పురోగమించాలంటే వారి ప్రయత్నములను రహస్యంగా ఉంచవలయునని యిద్దరూ ఒక నిర్ణయానికి వచ్చారు. అందుకై వాటిని వారు రహస్యంగా ఉంచేవారు. పాటలు, కీర్తనలు భావమును పెంచుటకు బాగా ఉపయోగపడునని వారు నమ్మారు. ఈ రీతిగా చేయు వారి సాధనకు బాహ్యప్రపంచమున వ్యక్తులు ఆకర్షింపబడి ఆయి యింటికి రాసాగారు. దానితో ఆ సాధన మనోలయమునకు అపరోధకమైనది. అది మనోలయమునకు సరియైన విధానము కాదని, సరియైన పద్ధతి 'జపము' అని నిర్ణయించుకొన్నారు. అయితే ఏమి జపము చేయవలెను? ఆమె అన్నది" అనేకమంది రాముని, విఠలుని నామములను జపము చేయుదురు. కాని సాయి నాకు దైవము' అని. ఆమె 'నాకు సాయి నామము చాలునన్నది. రేగే ఆమెను అనుసరించాడు. ఆ రీతిగా వారు 'సాయి' నామ జపము చేయసాగారు. రేగే అదృష్టమేమో! ఒకనాడు ఆ దినం ఉదయం ఏమి చేయుచుంటివని' బాబా రేగేను ప్రశ్నించెను. 'జపము' అని అతడు పలికెను.

బాబా : జపమా? ఎవరి నామము?

రేగే : నా దేవుని నామము.

బాబా : నీ దేవుడెవరు?

రేగే ఫ అది నీకు తెలియును

బాబా : అయితే మంచిది.

అందుచే 'సాయి' నామ జపము సాయిబాబా మొదటి నుండి అనుమతించినారు. జపము ఒక సాధన. జపము నుండి దేనిని సాధించ నగును! దీనికి కూడా బాబా నుండి వారు సమాధానము పొందారు. బాబా మాటల ద్వారా, చేతల ద్వారా గమ్యమేమిటో స్పష్టమయ్యేది. గురు రూపములో ఉన్న దైవమును చేయటయన్నదే 'ఆయము'. దానివలననే గమ్యము సాధ్యమవుతుంది. తీవ్రమైన, ఉగ్వేకరమైన ప్రేమ (భక్తులే) సాధన, సాధ్యములు. ఎందుకంటే పరిపూర్ణత నొందిన భక్తి ఆనందము నిచ్చును, ఆనందమే భగవానుడు. బాబా ప్రేమ ఆయి, రేగేలపై చెరగని ముద్రవేసినది. వారి సాధన కూడా పరిపూర్ణమైన ప్రేమ భక్తి పొందడానికే.

ఈ తీరుగా సాయినామజపము సాధనలో ప్రవేశించింది.

నామస్మరణను గురించి బాబా ఒక భక్తునికీ రీతిగా తెలిపినారు.

"నా నామమును జపింపుము. అది జీవుని కమ్మిన మాయయనెడు పొరను చింపివేయును, బ్రహ్మానందము వెంటనే పొందుదువు" కనుక నామ స్మరణ, జపం నిరంతరం చేయండి.

## శ్రీ శంకర జయంతి

పరమపూజ్య ఆచార్యులు ఆదిశంకరులవారు ఈ గడ్డపై అవతరించిన రోజు మే 15. వారు మనను అనుగ్రహించి అద్వైత రససిద్ధి కలిగించి తరింపజేసిన పుణ్యపురుషులు. ఆ రోజు శ్రీ శంకరుల చిత్రపటాన్ని, అది దొరక్కపోతే యీ యిష్టదైవాన్నైనా పూజించండి. వీలైనంత ఎక్కువ సమయం ధ్యానంలో లేదా నామంతో, ఆత్మవిచారణతో 'నేనెవరిని?' అన్న ప్రశ్నకు సమాధానం వెదుకుతూ గడపండి - వీలైతే శంకర కథ చదవండి.





## ఓసారి చదవండి!

## స్వామి తానై నడచి వచ్చిన సాయిధామం

ఒక ఆశ్రమం - అందునా సేవాశ్రమం నెలకొల్పాలంటే కృత్యాద్యవస్థగా ఎన్నెన్ని సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందో, శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా - ఎదుర్కోవలసివస్తుందో అనుభవిస్తేగానీ అర్థం కాదు. కేవలం ఆధ్యాత్మిక ఆశ్రమాలకన్నా సేవాశ్రమాలకు సమస్యల తాకిడి ఎక్కువ. ఐనాగానీ పరమాత్ముని కరుణ, తమ సంకల్పంలో శుద్ధీ, వివేకం తపశ్శక్తీ కలబోసిన సత్పరుషుల మార్గదర్శకత్వం దొరికిననాడు యీ సమస్యలన్నీ బెండుల్లా తేలిపోతాయి. మనకు చేయూతనివ్వడానికి భగవానుడే స్వయంగా దిగివస్తాడు. అలా తమకు ఎదురైన అనుభవాలను, పొందిన అనుభూతులను కలిపి సాయిధామం ప్రారంభదశ నుండీ దానితోనే తమ జీవితాన్ని ముడివేసుకొన్న **మాతా శుకవాణి** రచించిన పుస్తకం యిది. శ్రీ సాయి స్వయంగా ఎలా నడచి వచ్చారో తాము కళ్లారా కాంచిన భాగ్యశాలురు తమ అనుభవాలు మీతో పంచుకొనే చక్కని పుస్తకం యిది.


ఒకసారి చదవండి - తరించండి.

## ఆలోచించండి -

దీనిపై మీదైన భాషలో మీ భావాలు మాకు వ్రాయండి. ప్రచురిద్దాం.

Look at the world like a blind man
Hear at words like a deaf man
See you body a stick
It will give you peace.

**"ప్రపంచాన్ని అంధుడిలా వీక్షించు**
**శబ్దాలను చెవిటివాడిలా ఆలకించు**
**నీ తనువును కట్టెలా భావించు**
**అది నీకు శాంతినిస్తుంది."**



# వివేకవాణి



– స్వామి వివేకానంద

పాశ్చాత్యులు దేశాభిమానాన్ని గూర్చి తరచుగా మాట్లాడుతూ ఉంటారు. దేశాభిమానంలో నాకూ విశ్వాసం ఉంది. దేశాభిమానాన్ని గూర్చిన భావాలు నాకూ ఉన్నాయి. ఘనకార్యాలు సాధించడానికి మూడు విషయాలు అవసరం - మొట్టమొదటిది హృదయపూర్వకమైన సానుభూతి. బుద్ధిలోగానీ, తర్కంలోగానీ, ఏముంది? అని నాలుగడుగులు మాత్రం పోయి, అక్కడ ఆగిపోతుంది. కాని హృదయ ద్వారంలో దైవప్రేరణ కలుగుతుంది. ప్రేమ దుస్సాధ్యమైన ద్వారాలను కూడా తెరవగలుగుతుంది. జగద్రహస్యాలన్నిటికీ ప్రేమ సింహద్వారం. కాబట్టి సంస్కర్తలు కాగోరే మహాశయులారా! దేశాభిమానులు కాగోరే మహాత్ములారా! ముందు, సానుభూతిని అలవరచుకోండి. మీకు సానుభూతి ఉందా? దేవతల, మహా ఋషుల సంతానంలో లక్షల కొద్దీ జనం నేడు పశుప్రాయులైపోయారే అని మీరు నిజంగా దుఃఖిస్తున్నారా? లక్షలాది జనం తిండిలేక ఈనాడు మలమలమాడుతున్నారే అని గానీ, తిండి లేక కోట్ల కొద్దీ జనం అనేక యుగాల నుండి చచ్చిపోతున్నారని గానీ మీరు దుఃఖిస్తున్నారా? అజ్ఞానం నల్లని మబ్బులాగా దేశాన్ని కప్పివేసిందని మీరు ఆరాటపడు తున్నారా? అది మీ హృదయాలను కలచివేస్తున్నదా? మీకు నిద్రపట్టకుండా చేస్తోందా? అది మీ రక్తంలో ప్రవేశించిందా? మీ గుండె దానితో స్పందిస్తోందా? ఆ విచారంతో మీరు పిచ్చివారైపోతున్నారా? ఈ విధంగా అయ్యో సర్వం నాశనమైపోయింది గదా అనే చింత మిమ్మావహిం చిందా? ఆ చింతతో మీ పేరు ప్రతిష్ఠలను, మీ ఆలుబిడ్డలను, ఆస్తిపాస్తులను, శరీర సౌఖ్యాలను అన్నిటినీ మీరు మరచిపోయారా? నిజం చెప్పండి. అలా చేయగలిగారో, దేశాభిమానులు కావడానికి మీరు,





మొదటిమెట్టును ఎక్కారన్నమాట! అసలు నేను అమెరికాకు పోవడం మత మహాసభ కోసం కాదని మీలో చాలామందికి తెలుసు. నా దేశానికి నేను ఏ సేవా చేయలేకున్నాననే దుఃఖం నన్ను దయ్యంలాగా పట్టుకొంది. ఆ భావం నాలో చేరింది; నా ఆత్మలో దూరింది; నా దేశీయుల కోసమై పని చేసే మార్గం కనబడక పండ్రెండు సంవత్సరాలపాటు భారతదేశమంతా కలియ దిరిగాను. ఈ కోరికతోనే ఏమీ తోచక నేను అమెరికా వెళ్లాను. ఆ మత మహాసభ ఎవరికి కావాలి? నా రక్తమాంసాలు పంచుకొని పుట్టిన సోదరులు ఇక్కడ క్షీణించిపోతుండగా, ఆ సభ గొడవ ఎవరికి పట్టింది? అదే నా మొదటి భావం! మీకు ఆ దుఃఖం ఉందనుకుందాం. సరే నురుగును పోలి, బుసబుసలాడే వ్యర్థప్రసంగాలతో మీ శక్తినంతా ఖర్చు పెట్టుకోవడానికి బదులు యీ దుస్థితి నుండి వెలువడే మార్గాన్ని దేన్నైనా-ఆచరణయోగ్యమైన ఏ పరిష్కారాన్నైనా మీరు తెలుసుకున్నారా? శాపనార్థా లకు బదులుగా కొంచెమైనా సహాయం చేసే మార్గమేదైనా కనిపెట్టారా? వారి దుఃఖాలను ఉపశమింపచేయడానికై బ్రతికి ఉండగానే వారి ప్రాణాలను తీసే ఘోరహింసల నుండి వారిని తప్పించడానికై ఏ ఉపాయాన్నైనా మీరు కనుక్కోవడానికి ప్రయత్నించారా?

ఇంత కూడా చాలదు! పర్వతాల లాగా లేచి, అడ్డమై నిలిచే ఆటంకాలను దాటడానికి తగిన సంకల్పశక్తి మీకుందా? కత్తి చేతబట్టి ప్రపంచమంతా మిమ్మల్ని ఎదిరించి నిలిచినా, ధర్మమని తోచినదాన్ని ఆచరించడానికి మీరు సాహసిస్తారా? మీ భార్యలు, బిడ్డలు, మీకు విరోధులై నిలిచినప్పటికీ, మీ ఐశ్వర్యాలు నాశనమైపోయినప్పటికీ, మీ పేరు రూపు మాసినప్పటికీ, మీ సర్వమూ అదృశ్యమైపోయినప్పటికీ, మీ ధర్మాన్నే అంటి పెట్టుకొని నిలబడతారా? దాన్నే అనుసరిస్తూ మీ గమ్యాన్ని చేరేవరకు స్థిర సంకల్పంతో పురోగమిస్తారా? "ఋషులు నిందించనీ, స్తుతించనీ, భాగ్య దేవతరానీ, లేదా తన త్రోవన తానుపోనీ, ఈనాడే మరణం వచ్చి పడనీ-

లేదా నూరేళ్ల తర్వాత రానీ, సత్యమార్గం నుండి ఒక్క అంగుళమైనా తొలగని వాడే నిజంగా స్థిరచిత్తుడైన పురుషుడు” అని భర్తృహరి చెబుతున్నాడు. అలాటి సుస్థిరత్వం మీలో ఉందా? ఈ మూడూ మీలో ఉంటే మీలోని ప్రతివాడూ అద్భుతకార్యాలు చేయగలడు. మీరు వార్తాపత్రికలలో వ్యాసాలు వ్రాయనక్కర్లేదు, ఉపన్యాసాలిస్తూ అక్కడక్కడా తిరగవలసిన అవసరం లేదు. మీ ముఖవే దేదీప్యమానంగా తేజరిల్లుతుంది. మీరు గుహలలో నివసిస్తున్నప్పటికీ మీ సంకల్పాలు రాతిగోడలను ఛేదించుకొనిపోయి, శతాబ్దాలకొద్దీ లోకంలో అంతటా స్పందిస్తూ ఉంటాయి. అవి ఎవరి మేధస్సు లోనో నాటుకొని, అక్కడి నుండి మరలా పనిచేస్తూ ఉంటాయి. సంకల్ప శక్తి అలాంటిది. ఋజుత్వం మహిమ అని ఉంటుంది. నిష్కల్మష దీక్షకు అలాటి సమర్థత ఉంటుంది.

ఈ జాతీయ నౌక కోట్లకొద్దీ జీవులను ఈ జీవనస్రవంతి మీద దాటిస్తూ వచ్చింది. అనేక శతాబ్దాల నుండీ. ఇది ఈ నది మీద ఇటూ అటూ తిరుగుతోంది. దాని సహాయంతో కోట్లకొద్దీ జీవులు ఆవలి ఒడ్డుకు చేరి నిత్యానందాన్ని పొందగలిగారు. కానీ, నేడు మీ దోషం వల్లే కావచ్చు, ఈ పడవ కొంచెం ఓటిదైంది. దానికొక చిల్లు పడింది. అలా అని, దాన్ని మీరు నిందిస్తారా? ప్రపంచంలో ఏ ఇతర వస్తువూ ఇంత ఎక్కువగా పని చేయలేదని మీకు తెలుసు కదా? అలాటి ఈ నౌకపై కోప్పడి, చెలరేగి దాన్ని గూర్చి అమంగళ వాక్యాలు పలకడం మీకు తగునా? ఈ జాతీయ నౌకలో - ఈ మన సంఘంలో - రంధ్రాలున్నప్పటికీ మనం దాని బిడ్డలమే కదా? రండి, మనం వెళ్లి ఆ రంధ్రాలను బాగుచేద్దాం! మన హృదయ రక్తాన్ని ధారపోసి ఆ పని ఆనదంతో నిర్వర్తించుదాం! సాధ్యం కాకపోతే ఆ పవిత్ర కృషిలోనే మనం మరణిద్దాం!







# Surrender

- Swami Ramadas

The only way to be always happy is to submit to God’s will and leaving everything to him to be contented in the condition in which places us. Surrender means inner contetment and peace. It means giving up the egosense. Until the egosense is completely eliminated, we cannot realize God. Self surrender means that we throw the whole burden of life, our amilities and sorrows on the Supreme Lord who is the master of all and keep our mind filled with calmness and peace that comes from his constant remembrance.

Surrender and cling to the Lord in all situations. Don’t worry about anything. Have complete trust in God. Give up all superstitions notions. Don’t mind the opinions of the world about you. Court the society of pure and noble souls. Whenever changes come in your life take them that they come by God’s will alone. Take the changes cheerfully and naturally. We are under his care and protection.

Surrender to God as you are. It is not that we must purify ourselves first and then go to him. He must purify us. We must go to him as a child to its mother. If the child goes in a dirty condition to it’s mother. She doesn’t turn it away and ask it to come clean. She herself takes the child and bathes it clean. God is more loving than an earthly mother. When we surrender to God and allow ourselves to the guided by Him, all obstacles that come on the way are found to be helpful and beneficial to our progress. Life is a battle for all. There is a joy in winning as well as in losing also here. You tune your heart with God always. Then winning and losing are seen as the play of the Divine.

Some persons say that surrender is a sign of weakness. But Ramdas says it is the path of the strength. Surrender is not so easy as people think. It is very hard to eradicate the ego sense. That only can root out ego. It is the straight path that reaches to God.

# మాతృసంస్థ కబుర్లు

మార్చి 18 సోమవారంనాడు 'శ్రీ సాయి గ్రామ కళ్యాణం' కార్యక్రమం యావాపూరు తండాలో జరిగింది. ముందరిరోజు సాయి విద్యాధామం మా ఉపాధ్యాయ కార్యకర్తలు శ్రీ నరేశ్, మధు, శ్రీనివాస్‌ల బృందం ఆశ్రమానికి వెళ్లి బాలబాలికల సహకారంతో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. 18 ఉదయం తొమ్మిది గంటలకు సభా కార్యక్రమం ప్రారంభమైంది అక్కడి ప్రాథమిక పాఠశాల ఆవరణలో. బడిలో సంఖ్య అతి తక్కువగా ఉండటంచేత వాళ్లు కూడా వచ్చి పాల్గొనగలిగారు. శ్రీ సాయినాథులు, భరతమాత, స్వామీ వివేకానందులు, సేవాలాల్‌జీల చిత్రపటాలను పూలతో, పసుపు, కుంకుమతో ధూప, దీప, నైవేద్యాదులతో పూజించారు. తదుపరి మాతాజీ ఆశ్రమాన్నీ, హిందూ దేశ ధర్మాలలో శౌచానికున్న ప్రాధాన్యాన్నీ హైందవ ధర్మ దీప్తికున్న విశిష్టతనూ, భరతభూమి గొప్పదనాన్నీ పరిచయం చేసారు. తరువాత గురుదేవులు సేవాలాల్‌జీ చరిత్రను, వారి నుంచీ క్షత్రియ జాతీయులైన లంబాడీలు నేర్చుకోవలసిన గొప్ప లక్షణాలను, ధర్మ రక్షణ కోసం, గోరక్షణ కోసం సేవాలాల్‌జీలాగా ఉద్యమించవలసిన అవసరాన్ని వివరంగా బోధించారు. ఆ తరువాత జలాల్‌పూరుకు చెందిన నాగరాజు అనేవారు తమంతట తాముగా వచ్చి మాట్లాడారు. ఇలాంటి ధర్మజాగృతి ఆవశ్యకత చాలా ఉన్నదన్నారు. మన ధర్మాన్ని మనం సక్రమంగా నిర్వర్తించిననాడు పరధర్మం మనను ముంచే సమస్యేం రాదనీ, అందుచేత హిందువులు స్వధర్మాన్ని అనుష్ఠించటం చాలా చాలా అవసరమనీ, అందుకోసం అందరూ కలిసి పనిచేయాలనీ అన్నారు. శ్రీ మోతీరామ్, మాడావత్‌రాజు తదితరుల సహకారంతో జరిగిన యీ కార్యక్రమం ప్రసాదవితరణతో ముగిసింది. మా మేఘన తల్లి





ఆనవాయితీ తప్పకుండా వాళ్ల స్పెషల్ అయిన జొన్నరొట్టెలు అందించింది. సరదాగా నవ్వుకొంటూ ఆశ్రమానికి వచ్చాము.

మార్చి 23న గురుదేవులు సత్తెనపల్లిలో సాయిదేవాలయ నిర్మాణ పర్యవేక్షణకు వెళ్లి వెంటనే వచ్చేసారు. 24వ తేదీ ఆదివారంనాటి సాయంత్రం హాజీపురం గ్రామంలో "శ్రీ సాయి కళ్యాణం" తరఫున గ్రామ శుభ్రత చేపట్టబడింది. దాదాపు మూడు గంటలసేపు పనిచేసి గ్రామంలోని చెత్తా చెదారం ఏరటం, తగలబెట్టటం, గుడి కడగటం వగైరా పనులన్నీ పూర్తిచేసారు సాయి విద్యాధామం పిల్లలు, ఉపాధ్యాయులు కలిసి. మరునాడు 25 సోమవారం సాయంత్రం ఏడుగంటల ప్రాంతాలలో ఊరి మధ్య చెట్టు దగ్గర చక్కని సభకు ఏర్పాట్లు జరిగాయి. ఉపాధ్యాయులు చి॥ మధు, చి॥ నరేశ్, చి॥ శ్రీనివాస్‌లు, ప్రశాంతి వాసులు శ్రీ కె. నారాయణగారు, శ్రీ కాటేపల్లి చంద్రారెడ్డిగారు అంతా ముందుగానే అక్కడికి చేరుకోగా పూజా సమయానికి గురుదేవులు, మాతాజీని, నందుని, చిట్టిని తీసుకొని వెళ్లారు. శ్రీ సాయినాథులు భరతమాత, వివేకానందుల చిత్రపటాలకు పుష్పాలంకరణ చేసారు. చి॥ భార్గవి గురుదేవులకు, తదితర ఆశ్రమవాసులకు స్వాగతం చెప్పి, సభ్యులందరికీ కూడా ఆహ్వానం చెప్పింది. ఒకటి రెండు భజనలు చెప్పిన తరువాత నందు పూజా కార్యక్రమం పూర్తి చేసి హారతిచ్చాడు. తదుపరి మాతాజీ యీ కార్యక్రమ ప్రారంభం ఎలా ఎందుకు జరిగిందో వివరించారు. హిందూ ధర్మ వైశిష్ట్యం, శౌచం, వృక్షమూలాన్ని మరచిపోయి రెమ్మలు కొమ్మల పేర్లు చెప్పకొని బ్రతకటం వెనుక లోపాలను విశదీకరించారు. సింహాలై గర్జించవలసిన జాతి గొర్రె దాటుడు బ్రతుకు బ్రతకడాన్ని ఈసడించుకోవాలని చెప్తూ, పరులను అనుకరించటం, స్వత్వం కోల్పోవటం మనలోని సహజచేతననూ, పౌరుషాన్నీ నశింపజేస్తున్నాయన్నారు. గింజ మొలకగా అవతరించి, మహా వృక్షంగా పెరగటం వెనుక ఎందరి సహకారం తీసుకున్నాగానీ, తనదైన

ఆకృతినీ, లక్షణాలనూ పోగొట్టుకోదనీ, మన జాతి మాత్రం తన సంస్కృతీ సంప్రదాయాలను మర్చిపోతున్నదనీ, అలా జరుగకుండా మన భవిష్యత్ తరాన్నైనా మనం కాపాడుకోవాలనీ, 'ఇది నా గడ్డ' అనే భావాన్ని పెంచాలనీ ఉద్బోధించారు.

అటుపైన గురుదేవులు సభలోని రెండు వందలకు పైగా ఉన్న గ్రామీణులందరికీ తమ మంగళాశీస్సులను దయచేస్తూ-భరతభూమి ఘనతను వివరించి, వివేకానందుడు చేసిన మహత్తర సేవను శ్లాఘించారు. విధర్మీయులకు, విదేశీయులకు లోకువై తలవంచుకొని బ్రతకవలసిన దౌర్భాగ్యదశను కోరి తెచ్చుకొంటున్నామనీ, ఇకనైనా స్వాభిమానం నిలుపుకోవాలనీ ప్రబోధించారు. చివరగా ఒక సంవత్సరం పాటు యిలాగే పరిశుభ్రతను నిలుపుకొన్న గ్రామాలలో శ్రేష్ఠ గ్రామానికి బహుమతి ప్రదానం చేస్తామని ప్రకటించారు. తదుపరి గ్రామీణులు శ్రీ పక్కీరు రామిరెడ్డిగారి ద్వారా గురుదేవులను సన్మానించుకొన్నారు. చివరగా సాయి విద్యాధామం పాఠశాల పూర్వ విద్యార్థులు తమ గ్రామానికి వచ్చి ఆశీస్సులందించిన గురుదేవులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రసాద వితరణతో సభ ముగిసింది.

29వ తేదీ శుక్రవారం పరమపూజ్య గురుదేవుల జన్మదినం. ఆ సందర్భంగా 28వ తేదీ గురువారంనాటి ఉదయం నుండీ కార్యక్రమాలు ప్రారంభమైనాయి. సాయిచాలీసా పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణ, ప్రశాంతి, ఉష వాసులు విద్యాధామం పిల్లలు కలిసి చేసారు. ఉదయం పదిన్నరకు సాయినాథ వ్రతం ప్రారంభమైంది. మధ్యాహ్నహారతి తరువాత శ్రీ సాయి చరిత్ర పారాయణ, కొద్దిపాటి భజన, హారతితో ఆనాటి కార్యక్రమం ముగిసింది-సాయంత్రం నాలుగు గంటలకు. ఆరోజు ఉదయాన్నే వచ్చిన శ్రీమతి తంగమణి, శ్రీ అరవిందాక్షన్ నాయర్‌గారలు నాలుగు వందల మందికి సరిపడా రవ్వకేసరి, పులిహోర కమ్మగా





తయారుచేసి ఉంచారు. కార్యక్రమం తరువాత పాఠశాల పిల్లలందరికీ చేతినిండా పంచాము అవి.

29 ఉదయం శ్రీసాయికి క్షీరాభిషేకం, విష్ణు సహస్రనామంతో జరిగింది. అటుపైన పిల్లలు భగవద్గీత, భక్తియోగం, కర్మయోగం శ్రావ్యంగా చదివి వినిపించారు. అంతలో భక్తులు ప్రొద్దున్నే వచ్చిన శ్రీమతి లలిత, శ్రీ ఓంకార్ దంపతులు, శ్రీ లక్ష్మణరావుగారి దంపతులు-క్రమక్రమంగా ఆప్తులంతా వస్తున్నారు. గత మూడు రోజులుగా వడదెబ్బ కొట్టి నిరాహారంగా, కునుకులేని స్థితిలో ఉన్న గురుదేవులు లేవగలరా-అని సందేహం ఓప్రక్క-వచ్చిన వారంతా నిరాశపడతారన్న బాధ దానికితోడు. కానీ, బాబా వారి అనుగ్రహం వలన జ్వరం తగ్గి వారు లేచి కూర్చోగలిగారు. దానితో పది గంటలకు "సాయి కళ్యాణి"లో సమావేశమైనారు భక్తులంతా. శ్రీ సాయి దేవాలయంలో అర్చన తరువాత గురుదేవులు కళ్యాణి దగ్గరకు వచ్చారు. త్రోవ పొడవునా పిల్లలు చిచ్చుబుడ్లు, టపాకాయలు కాల్చి సందడి చేసారు. వారు కారు దిగగానే పట్టు చీరలు పరచి (మడుగులు) పూలజల్లులు కురిపిస్తూ తీసుకువెళ్లారు బాలికలు. వేదికపై దీపారాధన తరువాత కార్యక్రమం ప్రారంభమైంది. స్వాగతాదుల పిదప గురుస్తుతి జరిగింది. అటుపైన గురుదేవులకు అష్టోత్తర శతనామ పూజ చేసారు. తదుపరి మాతాజీ గురుదేవులు పదేపదే చెప్తుండే సూక్తులలో కొన్నిటిని ఏర్చికూర్చిన చిరుగ్రంథం 'గురుసూక్తం' ఆవిష్కరించారు గురుదేవులు. అదే తమ అక్షరార్చనగా విన్నవించుకొన్నారు మాతాజీ. ఆశ్రమ బాలబాలికలు ఒక చిన్న సాంస్కృతిక కార్యక్రమం ప్రదర్శించారు.

ప్రతి సంవత్సరం లాగానే కుష్ఠురోగులకు దుప్పట్లు, బియ్యం, పప్పు, నూనె వగైరాలు ఇచ్చిన తరువాత సంధ్య నివాసులందరికీ వస్త్రదానం జరిగింది. ప్రశాంతివాసులకు, సాయివిద్యాధామం ఉపాధ్యాయులకు శ్రీ సాయినాథుల వారి (రేడియం) చిత్రపటాలు కానుకలుగా

అందించారు. తదుపరి గురుదేవులు అనారోగ్య కారణంగా ఒక్క నిమిషం కన్నా ఎక్కువసేపు మాట్లాడలేకపోయారు. కొద్దిమంది భక్తులు గురుదేవుల వలన తాము పొందిన మేళ్లను గురించీ, గురుదేవుల బోధలను గూర్చీ, వారి విశిష్టతను గూర్చీ కొంతసేపు మాట్లాడి తమ అభిమానాన్ని చాటుకొన్నారు. తరువాత అందరూ గురుదేవులకు నమస్కరించి, ఆశీస్సులందుకొన్నారు. అన్న సమారాధనకు ఏర్పాట్లు జరుగుతుండగా మహాహారతి జరిగింది దేవాలయంలో.

ఈసారి యీ ఉత్సవాలలో అన్నదానం అంతా శ్రీ నాయర్‌గారే ఏర్పాటు చేసి తమ ప్రేమాభిమానాలను చాటుకోగా-ఆది నుంచీ అంతం వరకూ అన్నింటా తామై పనిచేయటమేగాక-చివరికి అంట్లు తోమటంతోసహా పూనుకొని చేసిన చి॥ నరేశ్, శ్రీనివాస్, మధులు శ్రీ సాయి విశేషకృపకు పాత్రులైనారు.

మంగళవారం 5వ తేదీనాడు ఖాజీపేట గ్రామంలో 'శ్రీ సాయి గ్రామ కళ్యాణం జరిగింది. ఆ చిన్నగ్రామమంతా చక్కగా శుభ్రం చేయటంలో సాయి విద్యాధామం విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామీణులైన మరి కొందరు పిల్లలు కూడా కలిసి పనిచేసారు. ఇంటింటి గడపకూ ఓంకారం స్టిక్కరు అంటించారు. తరువాత సాయంత్రం వేళ సభ జరిగింది. పిన్నా పెద్దా రెండు వందల మంది హాజరయ్యారు. పూజానంతరం మాతాజీ యీ కార్యక్రమ పరిచయం చేసారు. గ్రామానికి 'బొడ్రాయి' అన్నదే లేదనీ, పూర్వం ఎప్పడో యీ గ్రామం బాగా పెద్దదిగా ఉన్నపుడుండే బొడ్రాయి మామిడితోటలో ఎక్కడో ఉందనీ, గ్రామం చిక్కిపోయి యీ కాస్తే మిగలిందనీ, ఆ బొడ్రాయి తోట వాళ్లివ్వటం లేదనీ వృద్ధ గ్రామీణులు చెప్పగా విని మాతాజీ తల్లికీ తన బొడ్డుకూ ఉన్న బంధం ఎంత సత్యమూ శాశ్వతమో గ్రామానికీ బొడ్రాతికీ ఉన్న సంబంధం అంత స్థిరమైనదనీ,





దాని ఉనికినే విస్మరించటం కన్నతలిలని మరచిపోవటమంత పాపమనీ అన్నారు. వివాహం చేసుకొని ఊరు విడిచివెళ్లే ఆడపడచు బొడ్రాతికి పసుపు, కుంకుమ, పుష్పం పెట్టి నాకూ, నా జన్మభూమికీ బంధం తెగనీయవద్దని నమస్కరించి మరీ పొలిమేర దాటాలనీ, అలాటి చక్కని అద్భుత సంప్రదాయం మరచిపోవటానికీ, కట్టు, బొట్టు, సంస్కృతి, సంప్రదాయం మంటగలుపుకోవటానికీ కారణం ఒక్కటేననీ, మనం హిందువులమని మరచిపోవటమేననీ వివరించారు.

గొర్రెలలో పెరిగి స్వత్వం మరచిపోయిన సింహం గురించి చెప్పి, హిందువులు కేవలం సింహాలే కాదనీ, పోతనగారి భాగవతంలో భగవంతుడు 'కలడు త్రిలింగ దేశవ్యక్తులందంతటన్' అని ప్రహ్లాదుని చేత అనిపించారనీ, అలాటి హైందవజాతి యిలా స్వాభిమానం, పురిటిగడ్డపై ప్రేమ మరచి జీవించటం మూర్ఖత్వమనీ, ఇకనైనా చైతన్యం పెంచుకొని భావితరానికి మన పెద్దల వారసత్వ సంస్కృతిని అందించమనీ ప్రబోధించారు. తరువాత గురుదేవులు ఖాజీపేట అన్న పేరు మార్చుకొమ్మని సూచించారు. తరతరాల మన ఘనత తిరిగి సంపాదించుకొనే ప్రయత్నం చెయ్యాలన్నారు. పరమపవిత్రమైన యీ భరతభూమికి చెందిన ప్రజలను ఎవరో వచ్చి "మీరంతా పాపులు" అనే ధైర్యం ఎక్కడిది? మన పిరికితనమే వాళ్లకది యిచ్చిందన్నారు. అలక్ష్యంతో మనం వదిలేస్తే మన జాతి క్రమంగా యింకా పతనస్థాయికి వెళ్లిపోతుందనీ, పార్టీలకు, కులభేదాలకు అతీతంగా ధర్మరక్షణకు పూనుకోవాలనీ, అలాటి శక్తి పరమాత్ముడు యీ గ్రామానికి ప్రసాదించాలనీ ఆశీర్వదించారు. తదుపరి పల్లెపాటి యాదగిరి, జనార్దన్, రాములు గారలు కుటుంబం తరఫున శ్రీమతి లలిత గురుదేవులను శాలువాతో, పుష్పమాలతో సత్కరించుకొన్నారు. ప్రసాద వితరణతో సభ ముగిసింది.

# స్వార్థం ఎందుకు పెరిగింది?

– ఎం.వి. మాధవరావు

అప్పట్లో నేను మాండ్యాలో ఉన్నాను. స్వాతంత్ర్యోద్యమపు రోజులవి. అరవై ఎనిమిదేళ్ల నాటి మాటన్నమాట! మాండ్యాలో మహాబలరావుగారని ఒక అడ్వకేట్ ఉండేవారు. ఆయన తెలుగువాడు. చాలా మంచివాడు. దృఢమైన దేశభక్తి, ధైర్యసాహసాలు ఉన్నవాడు. గాంధీజీ అన్నా, సత్యాగ్రహం అన్నా, కాంగ్రెస్ (అప్పటి కాంగ్రెస్) సిద్ధాంతాలన్నా ఆయనకు చాలా గౌరవం. భారతీయులు తమ దేశభక్తిని బాహాటంగా ప్రకటించుకోవటాన్ని బ్రిటిష్ ప్రభుత్వం రాజద్రోహంగా భావించేది. అందుచేత ఏవో ఉత్సవాలలో (గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులవంటివి) నాటకాలు, బుర్రకథలు వంటి కళారూపాల ద్వారా పరోక్షంగా బ్రిటిష్ వారి అరాచకాలను చెరిగిపోస్తూ, భారతీయుల కష్టాలను కళ్లకు కట్టినట్లు చూపించేవారు. ప్రజలలో యివి చైతన్యాన్ని చెలరేగేలా చేసేవి. అందుచేత బ్రిటిష్ ప్రభుత్వం వందేమాతరమ్ అనటమే ఏదో బూతు మాట అన్నంత ఉలిక్కిపడేది. ఆనాటి కొన్ని పాటలను, నాటకాలను, గాంధీ గారి బొమ్మలను, భారత పతాకాలను ఇళ్లపైనో, ఇళ్ల ముందో పెట్టుకోవటాన్ని-యిలాంటి యింకా చాలా విషయాలను నిషేధించేది. ఒక్కొక్కసారి సూటిగా కాకుండా పరోక్షంగా అలాటి వాటిని అభిమానించిన వారిని నానాయాతనలూ పెట్టేది. తీర్పులిచ్చేయటమే తప్ప సంజాయిషీలు వినే పని లేదు. అలాంటి పరిస్థితులలో ఒకరోజు -

మహాబలరావుగారు కాంగ్రెస్ పతాకాన్ని (ఇదే జాతీయ పతాకంగా భావించేవారు ఆ రోజులలో)-అంటే మూడు రంగులుండి, మధ్యలో రాట్నం





ఉన్న జెండా తెచ్చి తన యింటి మీద ఎగురవేసాడు. దానితో తమ సామ్రాజ్యం మొత్తం కూలిపోతున్నంత హడావుడి పడిపోయి మహాబలరావు గారి మీద రాజ్య ధిక్కారనేరం ఆరోపించి కోర్టుకు తీసుకువెళ్లారు. దొరతనం వారు విచారణ అనే ప్రహసనం ముగించి, ఆయనకు కొంత డబ్బు జరిమానా (అపరాధ రుసుముగా) వేసారు. సత్యాగ్రహులు బ్రిటిష వారి కోర్టు విధించిన రుసుము చెల్లిస్తే తాము తప్పు చేసినట్లు అంగీకరించి నట్లవుతుంది గనుక చెల్లించరు. అందుచేత మహాబలరావుగారు జరిమానా కట్టనన్నారు. దానితో ప్రభుత్వం వారు ఆయన యింటిలో ఉన్న సామానంతటినీ వేలంవేసి ఆ డబ్బు వసూలు చేసుకోదలచి, అలా అని ఆర్డరు వేసారు.

గౌరవనీయ అడ్వకేట్ అయిన మహాబలరావుగారి యింటిముందు సామాన్లు పోగుబడ్డాయి. వాటిలో ఎంతో ఖరీదైన వస్తువులతోపాటు అత్యంత విలువైన గ్రంథాలు కూడా ఉన్నాయి. దాదాపు ఆ ప్రాంతాలలోని జనమంతా అక్కడ గుమికూడారు. నేను కూడా అక్కడే ఉన్నాను. ప్రభుత్వం వారి పాట మొదలైంది. దాన్ని పెంచడానికి ఏ ఒక్కరూ ముందుకు రావటం లేదు. పావుగంట, అరగంట, సుమారు గంటసేపు రకరకాలుగా ప్రయత్నించారు జనాన్ని ఆకర్షించాలని వేలం పాడేవారు. ఒక్కరిని కూడా ఆశలోకి దించలేకపోయారు. మహాబలరావుగారు భారతీయుడు. భారత స్వాతంత్ర్యపోరాటం పట్ల గౌరవం చూపిస్తున్నాడు. అలాంటి వ్యక్తి వస్తువులను చౌకగా వస్తున్నాయి గదా అని వేలం పాడుకొని సొంతం చేసుకోవటం పచ్చి స్వార్థం, పైగా జాతికి అవమానం. ఈ భావనతో ఎవ్వరూ కూడా వేలం పాటకు ముందుకు రాలేదు. చివరికి ప్రభుత్వ

యంత్రాంగవేమే విసిగిపోయి ఆ సామానంతా ఇంట్లోకి విసిరేసి వెళ్లిపోయింది. ఇదీ ఆనాటి ఆలోచనాధోరణీ, స్వార్థరహితబుద్ధీను.

ఇప్పుడో! నలభై రూపాయల అగరవత్తుల కట్ట పదిహేనుకో, ఇరవైకో యిస్తానని ఎవడైనా వస్తే చదువుకొన్నవాళ్లు, చదువురానివాళ్లు, ధనవంతులు, పేదవారు, స్త్రీలు, పురుషులు అంతా ఎగబడుతున్నారు. ఇరవై వేలు విలువ చేసే బంగారం వస్తువు అయిదు వేలకు వస్తుందంటే సరేసరి! ఇది దొంగ సొమ్మనిపించినా సరే చౌక గదా అని ఆశ. తొలి వాయిదా కట్టగానే వస్తువు చేతికి వస్తుందంటే ధనధన అలాటి సంస్థల్లో మెంబర్లుగా చేరిపోయి నెత్తికి చేతులు తెచ్చుకొనేవారెందరో! బోర్డులు తిప్పేసి పారిపోయిన చిట్‌ఫండ్ కంపెనీల ఆచూకీ పోలీసువాళ్లు తియ్యడం లేదనే వాళ్లు ముందుగా వాటి లైసెన్సులూ వగైరా గురించి పోలీసులను అడిగారా? లేదే! అసలివన్నీ ఎందుకు జరుగుతున్నాయి?

మొదటి జవాబు అవగాహన లేకపోవటం. రెండవది శ్రమించని సొమ్ము, పరుల సొమ్ము పాముతో సమానమన్న సూక్తి మర్చిపోవటం. ఇక మూడవదీ, బాగా బలమైనదీ మితిమీరిన స్వార్థం. భారతదేశంలో 'నీతి' అనేది మచ్చుకైనా కనిపించకుండా మాయమైపోవటం. దొంగ సొమ్ము- లేదా ఏదో నాసిరకం సరుకు చౌకగా వస్తే చాలుననే హీనపుటాలోచనల వలన నీతి చచ్చిపోతోంది. ఒక్క షష్టి పూర్తికే మన స్వరాజ్యపు సొగసు, మన సంస్కారాలు ఇంత యిలా భ్రష్టమైపోతే-మరో షష్టి పూర్తి నాటి పరిస్థితి ఎలా ఉంటుందో! "అసలు మన స్వరాజ్యానికి మరో షష్టి పూర్తి ఉంటుందా!" అన్న సందేహానికి మాత్రం తావివ్వకండి ప్లీజ్! అమంగళం ప్రతిహతమగు గాక!





# సత్సంగం-సత్ఫలితం

- అరవింద

సత్సంగం, మహాపురుషులతో, సాధు సంతులతో కలయిక అన్నది అత్యద్భుతమైన ప్రయోజనాలను ఇస్తుంది. ముఖ్యంగా ఒక మహాయోగితో కలయిక. కానీ ఇది సరైన రీతిలో నడవాలి. ఆ స్వామితో మనకు శారీరక సాన్నిధ్యం మాత్రమే ఏర్పడితే చాలదు. వారి ఆంతర్యంతో మన భావనలను అనుసంధానం చేయగలగాలి. అలా కాకపోతే సాధకుని మనసు ఆ స్వామి బాహిర ప్రవృత్తితోనే అనుబంధం పెంచుకొంటుంది. దేహాతీతమైన సత్య శక్తితో అనుబంధం ఏర్పరచుకోలేని ప్రమాదం ఉంది. ఆ యోగీశ్వరుడు తనలోపల ఏ దివ్యత్వాన్ని, ఏ మహత్తర సత్యశక్తినీ నిక్షిప్తం చేసుకున్నాడో-ఆ లోతులను స్పృశించలేకపోతే సాధకునికి సత్సంగఫలితం దొరకనట్లే సత్సంగంలో ఆ గురువుకు మంచి ఆసనం ఏర్పరచటం, పాదపీఠం అమర్చటం, పూలదండలు, పూజాదికాలు, కానుకలు, ఫలాహారాలు-వీటి తోనే గురువును వశపరచుకోగలమని-పోనీ అనుగ్రహం పొందగలమని- పోనీ ఆకర్షించుకోగలమని సాధకుడు అనుకొంటే అది పెద్ద తప్పు. కేవలం శారీరక సేవతోనే ఏ సరైన యోగీ సంతృప్తుడు కాడు. తనను సర్వజీవుల లోనూ సందర్శించగలుగుతున్నాడు-అందరినీ సమదృష్టితో చూడగలుగుతున్నాడు-అన్న స్థాయికి చేరిన సాధకుని పట్లనే మహనీయులు సంప్రీతులవుతారు.

రమణ మహర్షుల వారు భోజనానికి అందరితోపాటే (సహపంక్తిన) కూర్చొనేవారు. ఆయన పెద్దవారనో, గురువుగారనో, ఆయనకిష్టమనో వడ్డించేవారు కూరగానీ, వేపుడు ముక్కలుగానీ కాస్త ఎక్కువ వడ్డిస్తే రమణులు "ఏం, స్వామిని కూరముక్కలతోనే గెలుద్దామనుకొంటున్నారా? భగవాన్ అందరిలో లేడా?" అని విసుక్కొనేవారు. దీని అంతరార్థం పైన మనం అనుకొన్నదే - "అందరిలో నన్ను చూడండి - సమదృష్టి కలిగి ఉండండి" అని చెప్పటమే. అందుచేత -

సాధకునికి సంకుచితమైన, వ్యక్తిగతమైన భావనను మించిన ప్రమాదకర శత్రువు లేదు. అతడు ఎంత విశాల భావనతో తన హృదయ పరిధిని పెంచుకుంటూపోతాడో - అతని దృక్కోణాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ పోతాడో - అంతగా అతని సాధన పరిణతమై, సత్ఫలితాలనిస్తుంది.